ప్రథమ బహుమతి పొందిన కథానిక

# గతులు తప్పిన శ్రుతులు

కుమారి శ్రీదేవి

'రంజని' నిర్వహించిన కథానికల పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా పొందిన కథానికలను రసహృదయుల అవగాహనకై యిచ్చట ముద్రించుచున్నాము.

---

బరువైన సంధ్య అప్పుడే తేలికపడుతోంది. సంధ్యారాగంలోని వెలుగుల్ని సంతరించుకున్న నీటితరంగాలు గలగల శబ్దం చేస్తున్నాయి. అలలు అలలుగా ఉద్భవించిన ఆ శబ్ద తరంగాలు చలిగాలితో చేరి మంతనాలాడుతున్నాయి. ప్రమాదాన్ని మరిచి ఆ అపార, అలౌకిక సౌందర్యాన్ని తిలకిస్తున్న సమయంలో అందంగా నవ్విన ధ్వని నా హృదయ కుహరాలను త్రాకింది. హాయిగా, అమాయకంగా పాపానికి దూరంగా నిలబడి నవ్వగలిగిన స్వచ్ఛత వున్నది ఆ నవ్వులో. ఎప్పుడో, ఎక్కడో విన్న నవ్వు అది. ఆమె వసుంధర! పేరు మోసిన డాక్టరు నరసింహంగారి పిచ్చి భార్య. పక్కనున్న సిగరెట్టు పీకని సుకోమల హస్తాలలోకి తీసుకుని తన ధోరణిలో మాట్లాడుకు పోవటం మొదలెట్టింది.

'దేవుడికి దెయ్యానికి తేడా ఏమిట్రా తమ్ముడూ? అది ప్రకృతి. ఇది వికృతి_తెలుగు మేష్టారు నేర్పించలా నీకు. మర్చిపోయుంటావులే. ప్చ్. మరేం భయంలేదులే. ఎందుకలా ఎగిరి గంతులేస్తావ్? ఈకాలంలో నీలాటోటి వాళ్ళకి దేవుడూ కనపడడు దెయ్యమూ కనపడదు. దేవుడు అందరికీ మంచి చెయ్యడు, దెయ్యం అందరికీ చెడు చెయ్యదు. అదంతే. స్థిమితంగా కాలు మీద కాలేసుకు కూర్చో. కాసేపు కబుర్లు చెప్తాను.'

'నాకు దేముడన్నా భయం లేదు, దెయ్యమన్నా భక్తి లేదు. అసలు ఎవరికీ ఎందుకు భయపడాలంట. మనమేం తప్పు చెయ్యందే? పోనీలే పిచ్చి ముండావాడు, నోరు తెరిచి అడగ్గలడా ఏమన్నానా కనపడ్డ రాతికల్లా, రాతిలో వున్నాడన్న దేవుడికల్లా మొక్కాను. కంటికి కనపడని నా హారతులందుకుంటాడన్న పిచ్చితో నా నివేదనలోని సిన్సియారిటీ గ్రహిస్తాడని ఆశపడ్డాను. ప్చ్. ప్చ్. రేయి! విచిత్రమేమిటంటే ఎక్కడికెళ్ళినా పూజారులందరూ నన్నే పూజించటం మొదలెట్టారు. అంతర్యం గ్రహించలా? ఆడదిరా, ఆదిశక్తి. ఐనా బుద్ధి పొరపాటు నాదే! చిన్న పిల్లల్ని మిఠాయిలో ప్రలోభ పెట్టినట్టు, దేముడిని గూడా ప్రలోభ పెట్టటమే. ఎవరెంతవరకు అర్థంలో ఆయనకు మాత్రం తెలియదూ_అంట.'

'గడ్డమున్న ప్రతి మొగాడూ మంత్రసిద్ధి పొంది వుంటాడని అడ్డమైన పూజలూ చేసాను. అంతా వుట్టి నాటకంరా. కాషాయ గుడ్డచుట్టబెట్టుకున్నంత మాత్రాన కామ క్రోధ లోభాలు పోతాయిట్రా, ఎవరి పాపాన

వాళ్ళే పోతారు నాకెందుకు గాని. నొసట లేనిది నెత్తి కొట్టుకున్నా వస్తుందా?'

నెత్తి అంటే గుర్తుకొచ్చిది. జుట్టునిండా పేలే. రేపయినా గుండు చేయించుకోవాలి. పోదూ చాదస్తం. మొగుడికీ జుట్టుకీ ఏమిటి సంబంధం? నాకా పూర్వాచారాలంటే ఒళ్లు రవరవ లాడుతుంది. వాసన నూనె రాసి రాసి జుట్టు గబ్బు కొడుతోంది. గబ్బు కాని ముక్కులోంచి పోయి మెదడుకి జుట్టు మొలవదుకదా? మెదడుకి మానేసి గడ్డానికి మొలచినా బాగుణ్ణు. రోజూ నరసింహానికి మల్లే గడ్డం చేసుకుంటూ అద్దంలోంచి చూసి మాట్లాడచ్చు 'వసుంధరా నీకేం జబ్బు లేదే. కాకుంటే మెదడులో నరాలు పట్టు తప్పాయి కావి. ఈమాటు షాక్ ట్రీట్‌మెంటు యిచ్చానంటే అంతా సర్దుకుపోయి మామూలు మనిషవ వచ్చు అంటాడు. వాడి బొంద. మామూలు మనిషిని గాక నాకేం ఎద్దు కొమ్ములున్నాయా, ఏనుగు తొండముందా?'

'నాకు తెలీకడుగుతాను. మనిషికి జంతువుకి తేడా ఏమిటి? మనిషి వున్నదీ లేనిదీ వూదరంతా పోగేసుకుని చకచకా నాలుగు వాగేసి బలహీనతల్ని బయట పెట్టేసుకుంటాడు. జంతువు మాట్లాడకుండా మనిషి బలహీనతల్ని నెమరేసుకుంటూ వుంటుంది. జంతువుగా బ్రతకటమంటే ఎంత నిశ్చింతగా కాలం గడపచ్చు! మనిషిలోని కుళ్ళు, కపటం అంటకుండా మలినరహితమైన మనస్సుతో దైవత్వానికి దగ్గరగా పోవచ్చు. ధర్మరాజుతోపాటు కాలభైరవుడికి స్వర్గం ప్రాప్తించలేదూ? ఇంద్రుడికి కూడా స్వర్గం చూపేటప్పుడు తరతమ భేదాలు గుర్తుండవేమో! ఈమాటు దేముడంటూ కనిపిస్తే నన్నో కుక్కగానో, నక్కగానో మార్చెయ్యమంటా.'

'జగన్నాధం మామయ్యలా తెల్ల టోపీ పెట్టుకుని నలుగుర్నీ కలేసి మాయజేసే నక్కజిత్తులంటే నాకసహ్యం. తామ్ముడూ తెల్లటోపీ కింద ఏముంటుందో తెలుసురా? హి... హి... హి... హ్వాం. పుట్టి బట్టతలేరా? బాన పొట్టగూడా వుంటుందనుకో. నాకు తెలియకడుగుతాను—వియత్‌నాం వార్ గురించి, ఫుడ్ ప్రోబ్లమ్ గురించి, అనర్గళంగా వుపన్యాసాలిస్తే రాజకీయవేత్తలయి పోతార్రా? రాజకీయ నాయకులవతారు గాని ఇప్పుడు పుట్టిన పిల్లికూన గూడా నిర్విరామంగా దేశ సమస్యల్ని గురించి వ్యక్తిగత సమస్యల్ని గురించి కూస్తుంది. తేడా ఎక్కడొస్తొందయ్యా అంటే కూతలు కూసే మూడొంతులు మందికి సమస్యా పరిష్కారం తెలియదు.'

'నన్నో ప్రైమ్‌మినిష్టరో, ఛీఫ్ మినిష్టరో చేసి పడెయ్యరాదూ? దేశంలోవున్న విదేశస్తులందర్ని తన్ని తరిమేసి, పాకిస్తాన్ రూపు తెలియకుండా తుడిచేసి, విరక్షరాస్యులయిన మంత్రులందర్ని తిరుగు టిక్కెట్టిచ్చి యింటికి పంపేస్తాను. తర్వాత పార్లమెంటులో దుమ్ముదులుపుతారేమో!'

'అడిగేవాడికి చెప్పేవాడు లోకువట. చూడరాదూ. పోలీసు వెధవ యిందాక ఎన్ని ప్రశ్నల వర్షం కురిపించాడో. పోనీగదా వెర్రివెధవ తెలియక పేరడిగాడు చెపితెపోలా అని చెపితె వూరుకున్నాడూ. రాత్రిపూట ఆడపిల్లలు వంటరిగా బయటకు రాకూడదని తెలియదా అంటాడు. ఊ... పిచ్చికుంక ఒంటరిగాకాక జంటగా వస్తారా? లోకం కోడై కుయ్యదూ? నాన్న మక్కలిరగ తన్నకుండా వుంటాడా? ఏకాంతంలో వున్న ప్రశాంతత, దోకాంతంలో వుంటుందా? ఎవరూ లేనప్పుడు ఎన్ని రహస్యాలు మాట్లాడుకోవచ్చు? ఎందర్ని తిట్టుకోవచ్చు. ఎన్ని సుస్వప్నాలు చూడొచ్చు. ఏదీ మరో దున్నప్పుడు నోరుమెదిపి నిజం మాట్లాడు. చాచి లెంపకాయ కొడతాడు. ఎప్పుడూ? నువ్వు తిరిగి కొట్టవన్న గ్యారంటీ దొరికినప్పుడే హి... హి...

అయినా పుట్టినప్పుడు ఒక్కళ్ళం పుడతాం. చచ్చినప్పుడు ఒక్కళ్ళం చస్తాం. మరి బతికినప్పుడు మరో నేస్తమెందుకు? అదీ కిటుకు తెలియలా? మనిషికి మని

షంటే భయం. గొప్పవాడు, కొద్దివాడు అని రెండు వర్గాలున్నాయిగా చచ్చి. వాడికి వీడు శత్రువు. వీడికి వాడు శత్రువు. ఒకరికి మరోడు లోకువ. ఒకడిని మించాలని మరోడి తాపత్రయం. ఈ నిత్యపోరాటంలో చచ్చేది ఎక్కువ, బ్రతికేది తక్కువ. బ్రతికినవాడు రోజురోజుకీ పాపం బలిసి మరింత బలవంతుడౌతాడు. ఎవరబ్బా ఈ సిద్ధాంతాన్ని వెలికితీసుకొచ్చింది. డార్వినేనా? వాడు కాకపోతె మరో యాంకీగాడు. తెలియని దానికోసం బుర్ర బద్దలు కొట్టుకోవట మెందుకు. తెల్సిన విషయాలే బుర్రలో ఇమడక చస్తుంటే. అసలు ఈ శాస్త్రవేత్తలున్నారు చూశావ్ ఎప్పుడూ అంటే సదా తప్పుత్రోవనే ఎన్నుకుంటారు ఎందుకన్నా మంచిదన్నట్టు అందుకే పరిణామాలన్నీ నమ్మశక్యం గానంత విరుద్ధంగా వుంటాయి. జీవపదార్థం ప్రోటోప్లాజమట. అది ఎండిపోవటమంటే ప్రాణం పోవటమట. మరి ఆత్మగతి యేమిటి. అది వాళ్ళకి మాత్రం యేంతెల్సు నా మొహం.'

'నా మొహమంటే గుర్తుకొచ్చింది. బిందు ఎప్పుడూ అంటూ వుండేవాడు గులాబీ రేకుల కోమలత్వం, వెన్నెల చల్లదనం, సన్నజాజుల తెల్లదనం నీ అందానికి నాందీ గీతాలు అని. గులాబీ ఎంత త్వరితగతిని పసివాడిపోతుందో వెన్నెలలోని చల్లదనం ఎలా కరిగిపోతుందో అలాగే నా అందమూ కరిగిపోయింది. అందం 'స్కిన్‌డీప్'ట తోలు వలిచేస్తే అస్థిపంజరమేగా మిగిలేది మరి. ఈ మాటా బిందూని నిలదీసి అడగాలి. నా అందాన్ని ప్రేమించినంతగా అస్థిపంజరాన్ని ప్రేమిస్తాడో లేదో! నీ హృదయ పంజరంలో నా ప్రేమ పక్షి ఇరుక్కుపోయిందని ఏడ్చేవాడుగా—ప్రేమట, ప్రేమ. గాడిదగుడ్డేం కాదూ?' హి—హి—హ్హి నాకు ఏడుపొస్తోంది. ఛా. నాలాంటి వాళ్లు ఏడవరు. హి—హి...

ప్రేమకి పిచ్చికి తేడా లేదని భానుమతి ఎంత కమ్మగా అన్నది? ప్రేమ పిచ్చికాదు వున్మాదం అంటాను, వెర్రి అంటాను. పిచ్చి ముదిరితే వెర్రి ఎలాగవుతుందో ప్రేమముదిరినా అలాగే అవుతుంది. ఈ సిద్ధాంతం మీదేగా నేను రీసెర్చి చేస్తూ మానేసింది. ఎందుకు మానేసానబ్బా! ఉండు, గొడవ పెట్టకు. మెల్లిగా గుర్తు తెచ్చుకోనీ ఆ...ఆ...మన ప్రేమకి నీ చదువు అడ్డు అన్నాడుగా బిందు. పోనీ నిలుపు చేద్దామన్నాను. ఉ..హూ కుదరదు అన్నాడు. పోనీమానేద్దాం అన్నా—ఏమిటి ప్రేమే. నేను బ్రతకలేను అన్నాడు. అయితే చచ్చిపోరాదు అన్నా. నాతో నువ్వూ చస్తే నా అభ్యంతరం లేదన్నాడు. సరేనన్నా ఇంకేముంది. చావుకి బ్రతుక్కీ మధ్యగా ఆకాశానికి భూమికి మధ్యగా వదిలేసాడు. ఇది చరిత్రలో మామూలుగా జరిగేదే. ముందు ముందు జరుగుతుంది కూడా మరేం బాధపడకన్నాడు. మానేసాను కృష్ణుడు, రాధను ప్రేమించి మరిపించి, మురిపించి పారిపోలేదు. అలాగే ఇదీను. అగ్ని సాక్షిగా పెళ్ళాడిన ఇల్లాలిని రాముడు వదిలెయ్యలేదా? అది మరీ అన్యాయమనుకో. పురాణాలు వెతికి చూడు లేకపోతే చరిత్రపుటలు త్రిప్పిచూడు, ఆడది మోసగింప పడని దెప్పుడు. మోసం చెయ్యలేనంత అసమర్థుడెవడు. పురుషుణ్ని సృష్టించింది ప్రకృతిని మోసం చెయ్యటానికేగా? నేను మాత్రం తక్కువేం తిన్నాను. బిందు మీద కోపం నాన్నే మీద తీర్చుకోలా? చీకటి మాటున రూపాయి వస్తువు పది రూపాయలకు అమ్మజూపినప్పుడు లేని గౌరవం మర్యాద నా విషయంలోనే ఎందుడ్డు రావాలి అంట! మనుష్యుల రక్తాన్ని పీల్చి పిప్పి చేసే వర్తకుడికి మనిషి విలువేం తెలుసుంది అంట—అంటానికి కొంటానికి మరేం మిగిలి లేదులే.

మమతకు అనురాగానికి అర్థమేముంటుంది. డబ్బుతో నన్ను కప్పేసి నలుగుర్లో నన్ను వేలం వేస్తానన్నాడు. మనిషికి లేని విలువ డబ్బుకుంది చచ్చినట్టు. అక్కడికీ కనబడ్డ వెర్రి వెధవలందరూ డబ్బిచ్చెయ్యి, పిల్ల నీ దగ్గరే అట్టే పెట్టుకో అన్నారు. అప్పుడయినా బుద్ధి వచ్చిందా? వుహూ అసలు వుండేడిస్తేగా. అక్కడెక్కడో మార్కెట్లో అమ్ముతున్నారటగా. ఓ తులం కొనుక్కుని వేసుకోవాలి. ఈ మధ్య మందకొడిగా వుంటోంది ప్రాణం, నరసింహం


ఇచ్చిన మందులు తిని తినీ, వాడిచ్చిన చేదు మాత్రలు అచ్చం విషగుళికల్లా వుంటాయి. కాని మనిషిని చచ్చినా చంపవు. ఏమిటో విచిత్రం. అంతా తల క్రిందులుగా వుంది ప్రపంచంలో.

నా బొంద నేను చచ్చి ఎన్నాళ్ళయింది. పదిహేను సంవత్సరాలు కాలా? అయుండవచ్చు. కాలం ఒకరి కోసం స్థంభించి పోతుందా ఏమిటి. చచ్చిన పిల్లాడు బ్రతికే వుంటే ఇప్పటికి పదిహేనేళ్ళ వాడయ్యేవాడు. అయినా వాడెలా బ్రతుకుతాడు. కంసుడులాంటినాన్న. తోడేలు లాంటి మామయ్య గోతి క్రింద నక్కల్లా కాచుకుని వుంటే. అక్కడితో నా పాపం పరిక్షాళిత మైందంటాడు నరసింహం. వాడు నిజంగా వుత్తిపిచ్చి వాడు. లేకపోతే నన్ను యిన్ని సంవత్సరాలు భరించ గలిగేవాడా? ఒద్దురా మొగుడా అంటే పెళ్ళి చేసు కున్నాడు. పెళ్ళి చేసుకోటమంటే నరకానికి మరో మెట్టు దగ్గరవట మంటే విన్నాడూ. ఛప్ నీకుతెలియదు వూరుకో అన్నాడు. పోనీ గదాని వూరుకున్నా. వూరు కుంటే నరకం నరకంకాకుండా పోతుందా. నరసింహం నా కన్నా గొప్పవాడు. ఎందుకంటావేమొ నా కన్నా ఎక్కువ నరకాలు చూసేశాడు. నరకం తను చూసి నాకు చూపెట్టినప్పుడల్లా నా కాళ్ళ దగ్గర పడి యేడు స్తాడు. పాపం అనిపిస్తుంది. నిన్నెప్పుడూ కొట్టను వసూ, ఈ మాటు క్షమించు అంటాడు. అప్పుడు నాకు చాలా గర్వంగా హాయిగా వుంటుంది. రోజూ కొట్టి రోజూ క్షమాపణఅడగకూడదూ అనిపిస్తుంది. ఆ వుంగరాల జుట్టట్టుకుని దగ్గరగా తీసుకుని ముద్దెట్టు కుందామనే లోగానే నువ్వు రాక్షసివి, నా ప్రాణాలు తోడేస్తున్నావని పారిపోతాడు.

పోనీలే మనిషికి ఆ మాత్రమన్నా భయముండాలి. లేకపోతే యిష్టమొచ్చినన్ని వెర్రివేషాలేస్తాడు. మొగాడుగా సర్వస్వతంత్రుడు.

అబ్బ ఏమిటి చస్తున్నా. గంట నుంచి పింజారీ వాగుడు. నోరు మూసుకు వినకపోయావంటే చెవులు పిండేస్తాను. అంతే. విసుగనిపిస్తోందా. అవున్లే ఎవరి సొదలు వాళ్ళకున్నరోజు మరోడి సొదంటే బోర్‌గానే వుంటుంది. తమ్ముడూ మళ్ళీవస్తావుగా రేపు. కొంచం పనుంది అడుగో నా యముడు నరసింహం పరుగెత్తు కొస్తున్నాడు. నేనెక్కడ నీళ్ళలో దూకిప్రాణం తీసు కుంటాననో. వాడిభయం వాడిది. నేను ఛచ్చినా చావన్లవ్వి వాడికెన్ని మాట్లు చెప్పినా బుద్ధిలేదు. ఇదిగో వస్తున్నా మరేం కంగారు పడకు. ఇక్కడెక్కడయినా బిందు కనపడతాడేమో చూద్దామని వచ్చాను–ఎందుకంటావా ? ఎందుకేమిటి నీ మొహం నా మొహం వాడు నాపూర్వా శ్రమంలోని ప్రియుడు కదట్రా. మెల్లగా మాటలుజెప్పి తియ్యటి మాత్రిల్తో చల్లగాపైకి పంపిద్దామని, మరేం లేదు. వస్తా......

డాక్టరు నరసింహం ఆమెను వెంటబెట్టుకుని వెళ్ళి పోయాడు. వాతావరణం పూర్వంలా ఆహ్లాదకరంగానే వుండిపోయింది.



(8)